

అవగాహన నడకలో ప్ల కార్డులు ప్రదర్శిస్తున్న ఔత్సాహికులు

అవగాహనతోనే ఆటిజంను జయించొచ్చు

బంజారాహిల్స్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులకు సరైన అవగాహన లేక, ప్రాథమిక దశలో పిల్లల్లో వచ్చే బుద్ధి మాంద్యం సమస్యను గుర్తించకపోవడంతో అనేక సమస్యలు వస్తున్నాయని దివీస్ ల్యాబ్ ఎండీ డాక్టర్ మురళీ కృష్ణ దివి అన్నారు. ప్రపంచ ఆటిజం డే సందర్భంగా బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద దివీస్ ఫౌండేషన్ ఫర్ గిఫ్టెడ్ చిల్డ్రన్ ఆధ్వర్యంలో ఆటిజంపై అవగాహన నడక నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వ్యాధిపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని చిన్న వయసులోనే గుర్తిస్తే త్వరగా ఈ వ్యాధి నుంచి బయటపడవచ్చునని అన్నారు. తమ సంస్థ తరఫున ఆటిజంతో బాధపడుతున్న చిన్నారులు ఆ సమస్య నుంచి బయటపడేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా దివీస్ సంస్థకు చెందిన 300 మంది ఉద్యోగులతోపాటు వాకర్లు పెద్ద ఎత్తున అవగాహన నడకలో పాల్గొన్నారు. కార్యక్రమంలో, దివీస్ ల్యాబ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.వి. రమణ, సిఎఫ్ ఓ ఎల్.కిషోర్ బాబు వైస్ ప్రెసిడెంట్లు ప్రకాశ్ దివి, ఎల్. రమేష్‌బాబు, డి.మధుబాబు, జీఎంలు కె.సుబ్బారావు, బి.వర ప్రసాద్, పి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుదామని పిలిచి కత్తితో దాడి

బంజారాహిల్స్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మాట్లాడుదామని పిలిచి ఓ యువకుడిపై కత్తితో దాడి చేసిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బంజారాహిల్స్ శ్రీరాంనగర్‌కు చెందిన బేగర వంశీ ఇంటీరియర్ డిజైనర్. ఈ నెల 6న స్నేహితులతో కలిసి ఖైరతాబాద్‌లో ఓ పార్టీకి వెళ్లి తిరిగి బస్తీకి వచ్చాడు. ఇదిలా ఉండగా గత వారం బస్తీలో జరిగిన ఓ గొడవ విషయం మాట్లాడాలని నాని, చింటు, సుమిత్‌ను పిలవడంతో రోడ్డు నంబరు 12 లోని పోచమ్మ దేవాలయం వద్దకు వచ్చాడు. మాట్లాడుతుండగా నాని కత్తి తీసి దాడి చేశాడు. దీంతో వంశీ తల మీద ఒంటి పై తీవ్ర గాయాలు అయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు నాని, చింటు, సుమిత్‌లపై హత్యాయత్నం, ఆయుధాల చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేవాలయంలో చోరీకి యత్నం

● ఇద్దరిని పట్టుకున్న స్థానికులు

బంజారాహిల్స్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): దేవాలయంలో చోరీకి యత్నించిన ఇద్దరిని స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 13 నల్లపోచమ్మ దేవాలయాన్ని ఈ నెల 6న పూజారి తాళం వేసి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి దాటాక ఇద్దరు గోడ దూకి ఆలయంలోకి ప్రవేశించారు. అలికిడి విన్న స్థానికులు సతీష్ బయటకు వచ్చి చూడగా గోడ దూకుతున్న వారు కనిపించారు. పట్టుకునేందుకు ప్రయత్నించగా పారిపోయారు, అప్పుడే ప్రార్థనలు ముగించుకొని వస్తున్న యువకులు పరుగులు తీస్తున్న వారిని పట్టుకొని సతీష్‌కు అప్పగించారు. విచారించగా వారు జి.నరేందర్, ఎన్ రాజు అని తేలింది. చోరీ చేసేందుకు వచ్చినట్టు ఒప్పుకున్నారు. దీంతో నిందితులను బంజారాహిల్స్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జవహర్‌నగర్ పరిధిలో చైన్ స్నాచింగ్

వృద్ధురాలి మెడలో గొలుసు లాక్కొని పారిపోయిన యువకుడు

జవహర్‌నగర్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జవహరనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లారెడ్డిగూడలో ఆదివారం చైన్ స్నాచింగ్ జరిగింది. నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధురాలి మెడలోని గొలుసును బైక్‌పై వచ్చిన ఓ యువకుడు లాక్కొని పారిపోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన సాయమ్మ(60) తన కుమార్తెతో కలిసి ఈసీఐఎల్‌లో ఉంటున్న బంధువుల ఇంటికి వచ్చింది. ఆదివారం సాయంత్రం తన పెద్ద కుమార్తెతో కలిసి కాప్రాలోని ఎల్లారెడ్డిగూడలో ఉంటున్న చిన్న కుమార్తె ఇంటికి ఆటోలో వచ్చింది. బస్టాపు నుంచి కుమార్తె ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా.. వెనుక నుంచి పల్సర్‌బైక్‌పై వచ్చిన యువకుడు వృద్ధురాలి మెడలోని 5తులాల బంగారు గొలుసును లాక్కొని పారిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సౌత్ జోన్ ఏడీసీపీ షేక్ జహంగీర్

ఆటోలో నిద్రిస్తున్న డ్రైవర్‌ను పొడిచి.. దోపిడీ

● ముగ్గురిని అరెస్ట్ చేసిన మీర్‌చౌక్ పోలీసులు

హైదరాబాద్ సిటీ/చార్మినార్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన ఆటోలో నిద్రిస్తున్న ఆటోడ్రైవర్‌పై దాడిచేసి, నగదు, సెల్‌ఫోన్ దోచుకున్న ముగ్గురు నేరస్థులను మీర్‌చౌక్ పోలీసులు అరెస్ట్ చేశారు. పురానీహవేలిలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సౌత్‌జోన్ ఏడీసీపీ షేక్ జహంగీర్ వివరాలు వెల్లడించారు. దోపిడీకి పాల్పడిన ఇద్దరు నిందితులు పాత నేరస్థులని, వివిధ పోలీస్టేషన్‌లలో వారిపై కేసులున్నాయని తెలిపారు. కిషన్‌బాగ్‌కు చెందిన ఆటోడ్రైవర్ సయ్యద్ అబ్దుల్ హసన్ (35) పాత నేరస్తుడు. ఇతడిపై నగరంలో పలు పోలీస్టేషన్‌లలో 17 కేసులున్నాయి. యాకుత్‌పురాకు చెందిన సయ్యద్ తాలిబ్‌అలీ అలియాస్ సమీర్(22) ప్రైవేటు ఉద్యోగి, ఇతడిపై కూడా పలు పోలీస్‌స్టేషన్‌లలో 7 కేసులున్నాయి. బాల్‌షెటికేత్‌కు చెందిన ఆటో డ్రైవర్ సయ్యద్ తాహెర్ అలీ(30) స్నేహితులు. ఈనెల 5వ తేదీ తెల్లవారు జామున తాహెర్ అలీ, సమీర్, హసన్ ముగ్గురు ఆటోలో సాలార్‌జంగ్ మ్యూజియం రోడ్డులో వెళుతున్నారు. మాతాకిడికి ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ మహ్మద్ దస్తగిరి (35) ఈనెల 5వ తేదీ ఉదయం 5.30 గంటల ప్రాంతంలో సాలార్‌జంగ్ మ్యూజియం సమీపంలోని చిల్లా వద్ద రోడ్డుపక్కగా ఆటో ఆపి పడుకున్నాడు. వీరు ముగ్గురు ఆటోలో పడుకొని ఉన్న దస్తగిరి రెండు తొడలపై కత్తితో పొడిచి బెదిరించి, అతడి వద్ద ఉన్న రూ. 500, సెల్‌ఫోన్ తీసుకొని పరారయ్యారు. బాధితుడు మీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న మీర్‌పేట డీఐ దిలీప్‌కుమార్ బృందం సీసీ టీవీ ఫుటేజ్‌ల ఆధారంగా నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రెండు కత్తులు, ఆటో, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.



మాట్లాడుతున్న ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కే.బీ.శ్రీధర్

ఐపీసీపీ మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థిగా నాగ ఉదయలక్ష్మి

నల్లకుంట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ (ఐపీసీపీ) మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థిగా శివలంక నాగ ఉదయలక్ష్మిని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబీ.శ్రీధర్ ప్రకటించారు. ఎంపీ ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీ కూడా దివ్యాంగులకు ప్రాతినిధ్యం కల్పించలేదన్నారు. ఈ నేపథ్యంలో ఐపీసీపీ దివ్యాంగ విభాగం జాతీయ అధ్యక్షురాలు శివలంక నాగ ఉదయలక్ష్మిని ప్రకటించినట్లు ఆయన స్పష్టం చేశారు. ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటు బ్యాంకు కోసం దివ్యాంగులకు పెన్షన్లు మాత్రమే కల్పిస్తే సరిపోతుందని పాలకులు భావిస్తున్నారని ఆయన ఆరోపించారు. తమ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే అత్యంత సామాజిక బలహీన వర్గమైన దివ్యాంగులను అన్ని విధాలుగా ముందుకు తీసుకెళ్తుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు శివలంక నాగ ఉదయలక్ష్మి, వాసుదేవరావు, భాస్కర్‌నేత, ఆవుల అల్లాజీయాదవ్, కొండల్‌రావు, సరిత, నవీనరాణి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు ప్రజాదరణ పెరిగింది

● బీఆర్ఎస్ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్



బీఆర్ఎస్ ఖైరతాబాద్ నియోజకవర్గం సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్

బంజారాహిల్స్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో బీఆర్ఎస్‌కు ఆదరణ పెరుగుతుందని, రాబోయే ఎన్నికల్లో విజయం ఖాయమని సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ అన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గం సమన్వయ సమావేశం ఆదివారం తెలంగాణ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ నీటి సమస్య తలెత్తినప్పుడు తన నియోజకవర్గంలో సొంత నిధులతో వంద పవర్ బోర్లను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కాని ఎప్పుడు హడావుడి చేయలేదని తెలిపారు. కాని ఐదు సంవత్సరాలు ఏం పనిచేయకుండా కాలం వృథా చేసిన కేంద్ర మంత్రి ఇప్పుడు పవర్ బోర్లంటూ హడావుడి చేస్తున్నారన్నారు.

సికింద్రాబాద్ అసెంబ్లీ పరిధిలోని మండల కార్యాలయం వద్ద పది వేలతో షెడ్డు ఏర్పాటు చేసి దాని ప్రారంభోత్సవానికి సైతం హడావుడి చేయడం బీజేపీ నాయకులకే దక్కిందన్నారు. ఇలాంటి నాయకులను మరో సారి నమ్మి ప్రజలు మోసపోవద్దని హితవు పలికారు. కాంగ్రెస్‌కు అభ్యర్థులు లేక బీఆర్ఎస్ నుంచి తీసుకొని మరీ టికెట్టు ఇస్తున్నారన్నారు. బీఆర్ఎస్‌తోనే సురక్షిత పాలన సాధ్యమవుతుందని ప్రజలు ఇప్పుడు నమ్ముతున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే నీటి కరువు మొదలైందని, విద్యుత్ కోతలు తీవ్రం అయ్యాయని ఆరోపించారు. ప్రణాళికా లేకుండా పాలన సాగించి ఇప్పుడు నీటి కొరతకు కారణం బీఆర్ఎస్ అని పాలకులు ఆరోపించడంలో అర్థం లేదన్నారు. నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఎలాగున్న నగరాన్ని అభివృద్ధి చేసినందుకు ప్రజలంతా బీఆర్ఎస్ కే మద్దతు ఇచ్చారన్నారు. ఢిల్లీలో కూడా మన సమస్యలను వినిపించేందుకు సరైన నాయకుడు కావాలన్నారు. ప్రజల మనిషిగా పద్మారావుగౌడ్‌కు రాష్ట్రంలో మంచి గుర్తింపు ఉందని, ఉద్యమకారుడైన ఆయనకు బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ టికెట్టు కేటాయించిందని తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్‌లో బీఆర్ఎస్ జెండా ఎగురవేసి పార్టీకి తిరుగు లేదని నిరూపించేందుకు పార్టీ శ్రేణులు ఒక తాటి మీదకు రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, కార్పొరేటర్లు మన్నె కవితారెడ్డి, వెల్దండ వెంకటేష్, ఖైరతాబాద్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి, నాయకులు విప్లవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహావీర్ ఆస్పత్రిలో గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మహావీర్ ఆస్పత్రి రీసెర్చ్ సెంటర్‌లో గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం, డీలక్స్ రూమ్‌లను ఏఐజీ ఛైర్మన్, చీఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహావీర్ ఆస్పత్రి ఎన్నో ఏళ్లుగా విశేష సేవలు అందిస్తోందన్నారు. జీర్ణవ్యవస్థను ప్రభావితం చేసే రుగ్మతలు, జీర్ణ వాహిక, ప్యాంక్రియాస్, కాలేయం, పిత్త వాహికలు, పిత్తాశయం సంబంధించిన వ్యాధులు విపరీతంగా పెరుగుతున్నాయని, ఇలాంటి సదుపాయాలు ఉండడం వల్ల మెరుగైన వైద్యం అందుతుందన్నారు. నాలుగు దశాబ్దాలకు పైగా కుల మతాలకతీతంగా పేదలకు సేవలందిస్తుందన్నారు. మహావీర్ ఆస్పత్రిలో రోగుల మెరుగైన ఆరోగ్య సంరక్షణ కోసం అన్ని విభాగాలను అత్యాధునిక పరికరాలతో అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగాన్ని చంద్రకళాదేవి కాంతిలాల్ నహర్, కుటుంబం విరాళంగా అందించారని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ రూపేంద్ర ప్రసాద్, మహేంద్ర రంకా, సుశీల్ సంచేటి, డాక్టర్ ఆశా ఖివ్‌సార, డాక్టర్ ఘిసులాల్ జైన్, నితిన్ కె షా, పరేష్ షా, రాజేష్ పరాక్, రాజేష్ పోకర్నా, రమేష్ కుండాలియా, శీల్ కుమార్ జైన్, విజయ్ సురానా, విమల్ రాంకా, యోగేష్ జైన్ పాల్గొన్నారు.



మహావీర్ ఆస్పత్రిలో గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం డీలక్స్ రూమ్‌లను ప్రారంభిస్తున్న ఏఐజీ ఛైర్మన్ డాక్టర్ డి. నాగేశ్వర్ రెడ్డి

అల్లూరి సీతారామరాజు వ్యక్తి కాదు.. ఒక శక్తి

● కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి

పంజాగుట్ట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ వారి గుండెల్లో నిద్రపోయిన సింహస్వప్నం, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం మధురానగర్‌కాలనీ లోని శ్రీ సాగీ రామకృష్ణంరాజు కమ్యూనిటీహాల్‌లో క్షత్రియ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. మధురానగర్ సంక్షేమ సమితి ఉపాధ్యక్షుడు సీహెచ్.సత్యనారాయణ రాజు అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనంలో తెలుగు రాష్ట్రాల క్షత్రియ సామజిక వర్గానికి చెందిన పలువు రు ప్రముఖులు పాల్గొన్నారు. అల్లూరి సీతారామరాజు ఒక వ్యక్తి కాదు, ఒక శక్తి అని కిషన్ రెడ్డి అన్నారు. ఆయన తిరిగిన ప్రాంతాలను కేంద్ర నిధులతో అభివృద్ధి చేస్తున్నామని, ఆయనతో కలిసి స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న కుటుంబ సభ్యులందరికీ ఇళ్లను నిర్మిస్తున్నామన్నారు. త్వరలోనే వాటిని వారికి అందజేయనున్నట్టు తెలిపారు. త్వరలో జరగనున్న ఎన్నికలు దేశానికి సంబంధించినవని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో మూసీ అవతల 85 శాతం ఓటింగ్ జరుగుతుండగా, ఇవతల మాత్రం 35 శాతం కంటే పెరగడంలేదని, ఈసారి మాత్రం భారీగా ఓటింగ్ జరగాలన్నారు. అధిష్టానం సూచన మేరకు 19న నామినేషన్ వేయనున్నామని, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆత్మీయ సమ్మేళనంలో ఏపీ మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, క్షత్రియా హోటల్, ఎస్.ఎల్.జీ ఆసుపత్రి ఛైర్మన్ డి.శివరామరాజు, సినీ నటుడు, నిర్మాత శివకృష్ణ, విశ్వనాథ రాజు, నాని రాజు, డాక్టర్ రఘురామరాజు, డీజీకే.రాజు, రామ రాజు, నిర్మల, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు గౌతమ్ రావు, మాజీ కార్పొరేటర్ మనోహర్, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ పద్మ వీరపనేని, జె.కీర్తిరెడ్డి, దీపక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సికింద్రాబాద్‌లో బీఆర్ఎస్ జెండా ఎగరాలి'

ముషీరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ విజయం ఖాయమని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి టి.పద్మారావుగౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువ నాయకుడు ముఠా జైసింహ ఆధ్వర్యంలో ఆరు డివిజన్ల అధ్యక్షులు పద్మారావుగౌడ్‌ను కలిసి నియోజకవర్గంలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం పద్మారావు మాట్లాడుతూ... ప్రజల్లో బీఆర్ఎస్‌పై పూర్తి నమ్మకం ఉందని అందువల్లే నగరంలో అన్ని అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించామన్నారు. అదే స్ఫూర్తి పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కొనసాగేలా నాయకులు అంకిత భావంతో పనిచేయాలన్నారు. అనంతరం ఈ పద్మారావు గౌడ్‌ను ముఠా జైసింహ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు డి.శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, నాయకులు సాయి, భీమ్, కళ్యాణ్ పాల్గొన్నారు.

రత్నదీప్ సూపర్ మార్కెట్‌లో అగ్నిప్రమాదం

● భారీగా ఎగిసిపడిన మంటలు ● నగర శివారులో ఘటన



మార్కెట్‌లో ఎగిసిపడుతున్న మంటలు, పొగ చెలరేగిన దృశ్యాలు

నార్సింగ్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఆదివారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో త్వరలో ప్రారంభం కానున్న ఓ సూపర్ మార్కెట్ కాలిబూడిదైంది. ఈ ఘటన బండ్లగూడ మున్సిపాలిటీ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. లంగర్‌హౌజ్-అప్పా రేడియల్ మార్గంలో ప్రధాన రోడ్డుకు అనుకుని రత్నదీప్ సెలెక్ట్ సూపర్ మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఉగాది నుంచి ప్రారంభం కావాల్సిన మార్కెట్‌లో సెంట్రల్ ఏసీతో పాటు అన్ని రకాల ఎలక్ట్రికల్ పరికరాల ఏర్పాటు జరుగుతోంది. ఆదివారం సామగ్రి ఏర్పాటు చేస్తుండగా అగ్ని ప్రమాదం జరిగిందని, మంటలకు దట్టమైన పొగ అలుముకోవడంతో అందరం ఒక్కసారిగా బయటకు పరుగులు పెట్టామని కార్మికులు తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో కార్మికులు ఎవరూ గాయపడలేదని జిల్లా అగ్నిమాపక అధికారి గిరిధర్‌రెడ్డి తెలిపారు. ఆస్తి నష్టం లక్షల్లోనే ఉంటుందని, ఈ ప్రమాదానికి వెల్డింగ్ పనులు కారణమా లేక షార్ట్ సర్క్యూట్ కారణమా అన్నది దర్యాప్తులో తేలుతుందని అన్నారు. ఈ ఘటనపై రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.



నిరాహార దీక్షలో మాట్లాడుతున్న ఆప్ తెలంగాణ కన్వీనర్ సుధాకర్

కేజ్రీవాల్ అంటే మోదీకి భయం

● అందుకే ఆయన్ను అరెస్టు చేయించారు ● ఆప్ తెలంగాణ కన్వీనర్ దిడ్డి సుధాకర్

● కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా ధర్నాచౌక్ దగ్గర ఆప్ నాయకుల నిరాహార దీక్ష

కవాడిగూడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కేజ్రీవాల్‌ను చూసి మోదీ భయపడుతున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోతానేమోనన్న భయంతోనే కేజ్రీవాల్‌పై అక్రమ కేసు బనాయించి జైల్లో పెట్టించారని ఆరోపించారు. ఈడీ, సీబీఐ లాంటి దర్యాప్తు సంస్థలను కేంద్రంలోని బీజేప ప్రభుత్వం తన జేబు సంస్థలుగా మార్చుకొని, ప్రతిపక్ష నేతలను బెదిరిస్తోందన్నారు. దర్యాప్తు సంస్థల సాయంతోనే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గెలిచేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఢిల్లీ మద్యం కేసులో కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ ఆదివారం దేశవ్యాప్తంగా జరిగిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా.. ధర్నాచౌక్‌లో ఆప్ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో కూడా నిరసన నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు సుధాకర్ అధ్యక్షత వహించగా.. కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, సీపీఐ రాష్ట్ర నాయకుడు బాలమల్లేశ్‌తో పాటు పలు పార్టీల నేతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ... లిక్కర్ స్కామ్‌లో ఎలాంటి ఆధారాలు లేకపోయినప్పటికీ కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారన్నారు. బీజేపీకి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో విరాళాలు ఇచ్చినవారిని బెయిల్‌పై విడుదల చేశారని ఆరోపించారు. కేజ్రీవాల్‌పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేసి బేషరతుగా విడుదల చేయాలని సుధాకర్ డిమాండ్ చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమిదే విజయమని ఆయన పేర్కొన్నారు. దీక్షలో సీపీఎం, సీపీఐ నాయకులు, పలువురు వక్తలు మాట్లాడారు. కేజ్రీవాల్ అరెస్టును వారంతా ఖండించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు.

నిరుపేదలను ఆదుకోవడానికే రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు: ఎమ్మెల్యే

బర్కత్‌పుర, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నిరుపేద రెడ్డి సామాజిక వర్గాన్ని అన్ని విధాలుగా ఆదుకోవడానికే రాష్ట్ర ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో రెడ్డి గర్జన అధ్యక్షుడు గుర్రం పాపిరెడ్డి ఆధ్వర్యంలో 2024 డైరీ ఆవిష్కరణ, వివిధ రంగాలలో రాణిస్తున్న వారికి ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక సేవా రంగాలలో రెడ్డిసామాజికవర్గం అగ్రస్థానంలో ఉందన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న రాష్ట్రపతి అవార్డు గ్రహీత చింతల వెంకటరెడ్డి, శ్రీలక్ష్మి రెడ్డి, డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, రత్నారెడ్డి, డీజే.వసంతరెడ్డికి ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు.

కార్యక్రమంలో ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి, రెడ్డి జేఏసీ జాతీయ అధ్యక్షుడు నవల్గా సత్యనారాయణ రెడ్డి, తెలంగాణ రెడ్డి ఐక్యవేదిక అధ్యక్షుడు ఏనుగు సంతోష్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

మళ్లీ పెరిగిన చికెన్ రేట్లు

● లైవ్‌బర్డ్ రూ.220
● స్కిన్‌లెస్ కిలో రూ. 320
● నాటుకోడి కిలో రూ.400పైనే..
● కృత్రిమ కొరత సృష్టించి దోచుకుంటున్న వైనం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో చికెన్ రేట్లు మళ్లీ దడ పుట్టిస్తున్నాయి. 15 రోజుల క్రితం వరకు కాస్త అందుబాటులోకి వచ్చిన ధరలు.. ఆదివారం ఒక్కసారిగా పెరిగాయి. కిలోపై రూ.80 నుంచి రూ.100 వరకు పెరగడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు చికెన్‌ను కొనుగోలు చేసేందుకు వెనకంజ వేశారు. గ్రేటర్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా చికెన్ రేట్లు గరిష్ఠంగా పెరిగాయి.

తగ్గినట్లే తగ్గి..!

మార్చి మూడో వారంలో నగరానికి కోళ్ల దిగుమతి పెరగడంతో రేట్లు కాస్తా అందుబాటులోకి వచ్చాయి. ఈ మేరకు మార్చి 17 నుంచి ఏప్రిల్ 2 వరకు లైవ్‌కోడి కిలో రూ.120 నుంచి రూ.140 వరకు, స్కిన్‌లెస్ కిలో రూ.180 నుంచి రూ.200-220 వరకు విక్రయించారు. అయితే రేట్లు అందుబాటులోకి వచ్చాయని భావిస్తున్న తరుణంలో రెండు రోజులుగా మళ్లీ పెంచారు. ఆదివారం స్కిన్‌లెస్ కిలో రూ.300 నుంచి 320 వరకు, లైవ్‌బర్డ్ రూ.200 నుంచి రూ.210 వరకు విక్రయించారు. అలాగే నాటుకోడి కిలో బర్డ్‌ను రూ.400పైగానే అమ్మారు.

ఎండలను అడ్డుపెట్టుకుని దోపిడీ..

నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ఎండలను అడ్డుపెట్టుకుని వ్యాపారులు అడ్డగోలుగా దోచుకుంటున్నారని కొనుగోలుదారులు వాపోతున్నారు. నగర శివారు ప్రాంతాల నుంచి కోళ్ల దిగుమతి ఎక్కువగా ఉన్నప్పటికీ కొంతమంది కృత్రిమ కొరత సృష్టించి అందిన కాడికి దోచుకుంటున్నారని చెబుతున్నారు. స్కిన్‌లెస్ కిలో రూ.300 నుంచి 320 వరకు రేటు పెట్టడం దారుణమని, దీనికంటే రూ.400 పెడితే మటన్ వస్తోందని పేర్కొంటున్నారు.ధరలను నియంత్రణపై ఎవరూ పట్టించుకోకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రేపటి నుంచి ఉగాది నాటక మహోత్సవాలు

బంజారాహిల్స్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా నిర్వహించే ఉగాది రంగస్థల నాటక మహోత్సవాలను ఈ ఏడాది కూడా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పొత్తూరు వెంకట సుబ్బారావు తెలిపారు. ఈ నెల 9వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ఐదు రోజులు నాటక రంగంలో ఎన్నో ఏళ్లగా ఉన్న పేరుగాంచిన రంగస్థల నటులతో ఫిలింనగర్ ఫిలిం చాంబర్‌లోని రామానాయుడు కళా మండపంలో రాత్రి 7 గంటల నుంచి 10 గంటల వరకు పౌరాణిక నాటికలను ప్రదర్శిస్తామని అన్నారు. గుణ నిధి, మోహిని భస్మాసుర, బాలనాగమ్మ, సత్య హరిశ్చంద్ర, యయాతి నాటకాలను కళాకారులు ప్రదర్శిస్తారని తెలిపారు. కళాభిమానులు, కళాకారులు, సినీ రంగ ప్రియులు విచ్చేసి కళాకారులను అభినందించాలని వారు కోరారు.

మధురానగర్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో...

వెంగళరావునగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 9న శ్రీ సాగి రామకృష్ణంరాజు కమ్యూనిటీ హాలులో ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నామని సమితి అధ్యక్షుడు కోడె సాంబశివరావు తెలిపారు. పంచాంగ శ్రవణ ఉపన్యాసకులు అనంత్‌చే శ్రీ క్రోధి నామ సంవత్సర విశేషాలతో కూడి పంచాంగ శ్రవణ కార్యక్రమం ఉంటుందన్నారు.

యువతికి అర్ధరాత్రి ఫోన్ చేసి వేధింపులు

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రకరకాల ఫోన్ నెంబర్లతో ఫోన్ చేసి అసభ్య పదజాలంతో చదువుకునే ఓ అమ్మాయిని ఓ యువకుడు వేధింపులకు గురిచేస్తున్న సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... రహ్మత్‌నగర్ ప్రాంతంలో నివసించే 20 సంవత్సరాల యువతి చదువుకుంటోంది. అయితే ప్రతి రోజు అర్ధరాత్రి కరణ్‌జిత్ సింగ్(24) అనే వ్యక్తి ఫోన్ చేసి వేధిస్తున్నాడు. రకరకాల ఫోన్ నంబర్ల ద్వారా ఫోన్ చేసి ఇష్టానుసారం మాట్లాడుతున్నాడు. మీ కుటుంబ సభ్యులకు మనమధ్య అంతా జరిగిపోయిందని చెపుతా, సమాజంలో పరువు పోయేలా చేస్తా అంటూ బెదిరిస్తున్నాడు. అతని మాటలు తట్టుకోలేక పోతున్నానని అతనిపై చర్యలు తీసుకోవాలని జూబ్లీహిల్స్ పోలీసులకు కూడా ఫిర్యాదు చేసింది. అయినా అతని ఆగడాలు మానలేదని, ఇంకా బెదిరిస్తూ కామపూరిత మాటలు మాట్లాడుతూ ఇబ్బంది పెడుతున్నాడని, మానసికంగా చిత్రవధ అనుభవిస్తున్నానని, అతనిపై చర్యలు తీసుకోవాలని ఆ యువతి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లాడ్జి ముందు పార్కు చేసిన బైక్ మాయం

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): లాడ్జి ఎదుట పార్కు చేసిన బైక్ తెల్లవారే సరికి మాయమైన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్‌కు చెందిన తుమ్మల సాయి కిరణ్ నగరంలోని యూసుఫ్‌గూడ యాదగిరి నగర్‌లో నివాసం ఉంటూ ర్యాపిడో, ఉబర్ క్యాప్టెన్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 4వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో వెంగళరావునగర్‌లోని ఓ లాడ్జి వద్ద తన బైక్ పార్కు చేసి లాడ్జిలో తన స్నేహితుడి పార్టీకి వెళ్లాడు. తెల్లవారుజామున వచ్చి చూస్తే తన బైక్ కనిపించలేదు. వెంటనే మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బైరి.వెంకటేష్ మోచి

ఎస్సీ ఉప కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

బర్కత్‌పుర, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్, ప్రత్యేకబోర్డు ఏర్పాటు చేయాలని ఎస్సీ ఉప కులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బైరి.వెంకటేష్ మోచి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాల, మాదిగలతో సమానంగా ఎస్సీ ఉపకులాలకు పార్లమెంట్ సీట్ల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఉపకులాలపై ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ చేసిన వ్యాఖ్యలను ఆయన వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి సమావేశంలో వెంకటేష్ మాట్లాడారు. ఇప్పటి వరకు ఉపకులాలకు ఒక ఎంపీ, ఎమ్మెల్యే టికెట్ కూడా ఇవ్వలేదని, రాజకీయ పార్టీలు ఈ పద్ధతిని మార్చుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు టి.ఎన్.స్వామి, సత్యనారాయణ, మహేందర్, నర్సింగ్‌మోరే, బాల్‌రాజ్, శోభ, రామారావు, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.



వాకర్స్ సీనియర్ సిటిజన్స్ ఆశీర్వాదం తీసుకున్న బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

అభివృద్ధికి ఓటెయ్యండి

రాగిడి లక్ష్మారెడ్డి

మారేడుపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : తనకు మద్దతు తెలిపి కారు గుర్తుకే ఓటు వేయాలని మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి వాకర్స్ సీనియర్ సిటిజన్లను కోరారు. ఈ మేరకు ప్రచారంలో భాగంగా కంటోన్మెంట్ మారేడుపల్లి నెహ్రూనగర్ పార్క్‌లో బీఆర్ఎస్ నాయకులు, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, జి.నివేదితతో వాకర్స్ కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... గత ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని రాగిడి కోరారు. తెలంగాణ ప్రభుత్వ హయాంలో అనేక ప్రజా సంక్షేమాలు అమలు చేయడంతో పాటు విశ్వనగరాన్ని అపురూపంగా తీర్చిదిద్దిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నెహ్రూనగర్ పార్క్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షులు హనుమంత రావు యాదవ్, వాకర్ అసోసియేషన్ అధ్యక్షులు కుమార్, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, నాయకులు టిఎన్ శ్రీనివాస్, ముప్పిడి మధుకర్, శేఖర్ ముదిరాజ్, సంతోష్ పాల్గొన్నారు.

గుండె ధైర్యంతో పనిచేయాలి

డాక్టర్ సారా



మహిళకు కుట్టుమిషిన్ ఉచితంగా అందజేస్తున్న డాక్టర్ సారా, కళాజ్యోతి

అడ్డగుట్ట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో గుండె ధైర్యంతో పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సెవన్ రేస్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ సారా సూచించారు. అడ్డగుట్టకు చెందిన పద్మ భర్త లేకపోవడంతో పాటు ఆర్థికపరమైన ఇబ్బందులు పడుతూ స్వశక్తితో కుటుంబాన్ని పోషించేందుకు సెవెన్ రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఖరీదైన కుట్టుమిషిన్‌ను ఆదివారం ఉచితంగా అదజేశారు. కుటుంబాన్ని పోషించుకుని గుండె ధైర్యంతో ముందుకు సాగాలని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల సాధన సమితి అధ్యక్షురాలు కళాజ్యోతి పాల్గొన్నారు.

మద్యం కొనుగోలుకు వెళ్లిన వ్యక్తి అదృశ్యం



బుచ్చయ్య

తిరుమలగిరి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మద్యం కొనుగోలుకు వెళ్లిన వ్యక్తి అదృశ్యం అయిన సంఘటన తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్.ఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం తిరుమలగిరి సాయిబాబ హట్స్‌కు చెందిన బుచ్చయ్య(40), శివమ్మ భార్యాభర్తలు స్థానికంగా కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే బుచ్చయ్య శనివారం సాయంత్రం డైరీ ఫాం రోడ్డులోని శుభాష్‌నగర్‌లో మద్యం కొనుగోలుకు వెళ్ళాడు. భార్య శివమ్మ భర్తకు ఫోన్ చేయగా కొంపల్లిలో ఉన్నాను కొద్ది సేపట్లోనే వస్తున్న అని సమాధానం ఇచ్చాడు. మరికొంత సమయానికి ఫోన్ చేయగా లోత్‌కుంటలో ఉన్నాను వస్తున్న అని చెప్పాడు. ఎంతకూ రాకపోవడంతో తిరిగి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. బంధు మిత్రులను సంప్రదించినా ఫలితం లేకపోవడంతో ఆదివారం తిరుమలగిరి పోలీసులకు శివమ్మ ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉప ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే మరింత అభివృద్ధి : విజయ్‌కుమార్



విజయ్‌కుమార్

సికింద్రాబాద్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): నరేంద్ర మోడీ నేతృత్వంలో భారతదేశం అన్ని రంగాల్లో సాధిస్తున్న అభివృద్ధిని చూసి సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రజలు బీజేపీ పట్ల మరింత ఆకర్షితులవుతున్నారని, ఉప ఎన్నికల్లో కమల వికాసం ఖాయమని ఆ పార్టీ నాయకుడు వి.తులసీరామ్ విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం మారేడుపల్లిలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కేంద్ర రక్షణ శాఖ పరిధిలోని సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో కేంద్ర ప్రభుత్వ నిధుల వలన అభివృద్ధి జరుగుతున్నదని, ఉప ఎన్నికల్లో కూడా బీజేపీని గెలిపిస్తే మరింత అభివృద్ధి సాధ్యమని ప్రజలు విశ్వసిస్తున్నారని చెప్పారు. గడిచిన ఎన్నికల్లో కంటోన్మెంట్ బీజేపీ టిక్కెట్‌ను తాను ఆశించానని, అయితే పార్టీ అధిష్ఠానం ఎన్.శ్రీగణేష్‌కు అవకాశం ఇచ్చిందని పేర్కొన్నారు. కాగా శ్రీగణేష్ పార్టీని వీడడంతో ఈ ఎన్నికల్లో తనకు అవకాశం దక్కుతుందని ఆశిస్తున్నట్టు ఆయన తెలిపారు. కంటోన్మెంట్‌లోని అన్ని వర్గాల ప్రజలతో సన్నిహిత సంబంధాలు ఉన్న తనకు టిక్కెట్ కేటాయిస్తే తప్పక గెలుస్తానని విజయ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు.

కాం గ్రెస్ తీరుకు నిరసనగా.. దిష్టిబొమ్మ దహనం

బౌద్ధనగర్, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రకటించిన పార్లమెంట్ స్థానాల్లో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు టికెట్లు కేటాయించకుండా కాంగ్రెస్ పార్టీ తీవ్రమైన అన్యాయాన్ని చేసిందని నిరశిస్తూ ఆదివారం సీతాఫల్‌మండి చౌరస్తాలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్), మహాజన సోషలిస్ట్ పార్టీ(ఎంఎస్‌పీ) నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబోమ్మను దహనం చేశారు. ఎంఎస్‌పీ కన్వీనర్ నందారం సీతారాంమాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్ మాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొని కాంగ్రెస్‌పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకాధ్యక్షుడు మందకృష్ణమాదిగ ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబోమ్మను దహనం చేసామని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిగల ఓట్లును అడిగే నైతికహక్కును కొల్పోడయాని, కాంగ్రెస్‌పార్టీ మాదిగలకే కాదు బీసీలకు అన్యాయం చేసిందని మల్లికార్జున్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పునరాలోచన చేసి మూడుస్థానాల్లో రెండుస్థానాలను మాదిగలకు కేటాయించాలని లేని పక్షంలో తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికారప్రతినిధి కొమ్ము శేఖర్‌మాదిగ, సికింద్రాబాద్ ఇంచార్జి తుమ్మల శివ ప్రసాద్, నాయకులు నర్సింగరావు, విజయకుమార్, మహేందర్, దేవేందర్, సురారం సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆదరణ కోల్పోతున్న ఎర్రకుండ!

- ఇబ్బందుల్లో తయారీదారులు
- ఇతర రాష్ట్రాల కుండలపై వినియోగదారుల ఆసక్తి

రెజిమెంటల్‌బజార్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): వేసవి కాలంలో మట్టి కుండలు విక్రయించడం వలన కుటుంబానికి కొంత ఆర్థిక ఉపశమనం లభిస్తుందని భావించిన వ్యాపారులకు నిరాశ మిగులుతుంది. కొనేవారు లేక లాభదాయకంగా ఉంటుందని కుండలు తెచ్చిన వారి పరిస్థితి అయోమయంగా తయారైంది. సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లోని పాట్ మార్కెట్‌లో 20 కుటుంబాలు కుండల వ్యాపారం చేసుకుంటు, కుటుంబాన్ని పోషించుకుంటు జీవిస్తున్నారు. వేసవి కాలంలో కుండల అమ్మకాలు ఎక్కువగా ఉంటుండటంతో కొంత ఆసరాగా ఉండేది. గత సంవత్సరాలతో పోలిస్తే ఈ సంవత్సరం కుండల విక్రయాలు ఆశించిన స్థాయిలో అమ్మకాలు లేకపోవడంతో వ్యాపారులు దిగులుపడుతున్నారు. ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదని వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు.



మోండా మార్కెట్‌లో అమ్మకానికి ఉన్న కుండలు

గిరాకీ లేని ఎర్రకుండలు

తాండూర్ నుంచి తెచ్చి విక్రయించే ఎర్రకుండల కొనుగోలుపై ప్రజలు ఆసక్తి చూపకపోవడంతో అమ్మకాలు సాగడంలేదు. ఒక కుండను రూ.200 - 250కు అమ్ముతున్నారు. కొనుగోలుదారులు ఎక్కువగా పాట్నా, రాజస్థాన్ నుంచి తెచ్చి అమ్మే కుండల కొనుగోలుపై ఆసక్తి చూపిస్తుండటంతో స్థానికంగా తయారైన ఎర్ర కుండల వ్యాపారం సాగడంలేదు. వేసవి సీజన్‌లో విక్రయాలు ఉంటాయని ఆశతో ఎర్రటి కుండలు తెచ్చిన వ్యాపారులకు నిరాశే ఎదురవుతుంది.

గిరాకీ లేదు



తాండూర్ నుంచి తెప్పించి అమ్ముతాం. ఒక లోడ్‌లో 300 కుండలు వస్తాయి.కిరాయి ఒక లోడుకు 6000 ఖర్చు అవుతుంది. అమ్ముడు పోత లేవు.కిరాయి పైసలు కూడా మిగిలేటట్టు లేవు. ఇదివరకు బాగానే ఉండేది. ఈ సంవత్సరం ఇబ్బందిగా ఉంది. -వరలక్ష్మీ, కుండల వ్యాపారి

స్థానికంగా తయారైన కుండలు కొనడం లేదు



రాజస్థాన్, పాట్నా నుంచి తెచ్చిన కుండలు కొంటున్నారు. లోకల్‌లో తయారైన కుండలు కొనడం లేదు. ఏండ్ల నుంచి కుండల వ్యాపారం చేస్తున్నం రాజస్థాన్, పాట్నా నుంచి కుండలు తెప్పించి అమ్మే ఆర్థిక స్థోమతలేదు. ఇక్కడ తయారైన కుండలు అమ్మకాలు సాగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం.

-సోనీ, కుండల వ్యాపారి

ఘనంగా ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ జన్మదిన వేడుకలు

బౌద్ధనగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ లోక్‌సభ ఎంపీ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్ జన్మదిన వేడుకలు ఆదివారం సికింద్రాబాద్, సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ తదితర ప్రాంతాల్లో ఘనంగా జరిగాయి. యువనాయకులు తీగుళ్ల కిషోర్‌గౌడ్, కిరణ్‌గౌడ్, రామేశ్వర్‌గౌడ్, తినేత్రగౌడ్, కుటుంబసభ్యుల సమక్షంలో పద్మారావుగౌడ్ ముందుగా కేకును కట్ చేశారు. శ్రీనివాసనగర్ సవరాలబస్తీకి చెందిన పొగర్తి భువనరావు పద్మారావుగౌడ్‌కు శాలువా కప్పి స్వీట్లు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆకాంక్ష అధినేత లయన్ అశ్వాపురం వేణుమాధవ్, కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, మాజీ కార్పొరేటర్ కందినారాయణ, కరాటే రాజు, యువనాయకులు సుంకు రామచందర్, బొల్లసుమిత్‌యాదవ్, ప్రభుత్వ ఎంపాయిస్ యూనియన్ నాయకుడు జి.చంద్రశేఖర్ (చందు), అడ్డగుట్ట సీనియర్ నాయకుడు పి.గణేశ్‌తోపాటు అభిమానులు, నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేకును కట్ చేశారు. పలువురు నాయకులు పూల దండలు, బోకేలందజేసి శుభాకాంక్షలు తెలిపి స్వీట్లును తినిపించారు. అంతకుముందు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లు పద్మారావుగౌడ్‌కు ఫోన్‌లో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాగంటిగోపినాద్, కాలేరు వెంకటేశ్, ముఠాగోపాల్ తదితరులు పద్మారావు గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌తో కేకును కట్ చేయిస్తున్న యువనాయకులు సుంకు రామచందర్, బొల్ల సుమిత్‌యాదవ్ తదితరులు



ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌కు శాలువా కప్పి స్వీట్లు అందజేస్తున్న పొగర్తి భువనరావు

కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో..

అడ్డగుట్ట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ ఎమ్మెల్యే లోక్‌సభ సికింద్రాబాద్ అభ్యర్థి పద్మారావు పుట్టిన రోజు సందర్భంగా అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నివాసంలో అడ్డగుట్ట డివిజన్ నేతలతో కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, మహ్మద్ గౌస్, అల్లబకాస్, పి.రాజు, ఖైరంకొండ యాదగిరి, నర్సింగ్, అమర్, దాసరి శ్రీనివాస్, శ్రీరాం గొనేమల్లేష్‌లు పాల్గొన్నారు.



ఆర్టీసీ సిబ్బందికి బట్టర్ మిల్క్ పంపిణీ చేస్తున్న స్పై.ఫౌండేషన్ ప్రతినిధులు

బట్టర్‌మిల్క్ పంపిణీ

పద్మారావునగర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : పద్మారావునగర్‌లోని స్పై.ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వై.సంజీవకుమార్, ఉపాధ్యక్షురాలు ఓ.పావని ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని అనేక ప్రాంతాలలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర పాదచారులకు వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకొని బట్టర్ మిల్క్, బిస్కెట్లను అందజేశారు. దానితో పాటుగా రోడ్లపై ఫుట్‌పాత్ పక్కన దుర్భర జీవనం సాగిస్తున్న అనాథలు, అభాగ్యులు, నిరాశ్రయిలకు దుస్తులు, బట్టర్ మిల్క్, వాటర్ పాకెట్స్‌ను అందజేశారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న కూరగాయాల వ్యాపారి మనస్థాపంతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సికింద్రాబాద్ రైల్వే పోలీసుల కథనం ప్రకారం కవాడిగూడకు చెందిన సాంబ శ్రీనివాస్ (57) మోండా మార్కెట్‌లో కూరగాయాల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు ఈ కారణంగా మనస్థాపానికి గురైన శ్రీనివాస్ ఆదివారం సంజీవయ్య పార్కు సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అన్నమాచార్య కీర్తనలపై .. ఆన్‌లైన్‌లో వేసవి శిక్షణా తరగతులు

హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : వేసవి శిక్షణా తరగతులలో భాగంగా సాయి నృత్య తరంగిణి సంస్థవారు ఆన్‌లైన్‌లో లలిత సంగీతం, అన్నమాచార్య కీర్తనలు, రామదాసు కీర్తనలు, పురందరదాసు కీర్తనలలో శిక్షణా తరగతులు ఈనెల 25 నుంచి మే 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ కె.ఎన్. రాజేశ్వరి తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేయబడతాయని చెప్పారు. దీనికి ఎటువంటి వయోపరిమితి లేదని, మరిన్ని వివరాలకు సెల్ నెం.9032559938 కు సంప్రదించాలన్నారు.

ఉగాది, శ్రీరామనవమి ఘనంగా నిర్వహించాలి

బోయిన్‌పల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఆలయ కమిటీ సభ్యులు రానున్న ఉగాది శ్రీరామనవమి పండుగలను ఘనంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ తెలిపారు. కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని 6వ వార్డు సీతారాంపురంలో గల శివపంచాయతన ఆంజనేయస్వామి ఆలయం వార్షిక సమావేశాలు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్, బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్‌ల ఆధ్వర్యంలో ఆదివారం ఆలయంలో జరిగాయి. కార్యక్రమంలో మాల్యాద్రి సుదాకర్‌రావు, శంకరయ్య, కృష్ణ, నాగభూషణం, జి.గోవర్ధన్, స్వరూప, గోపాల్‌గౌడ్, సాయిబాబా యాదవ్, నారాయణ గౌడ్, జి.కృష్ణ, నందమయ్య గౌడ్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రైలు పట్టాలు దాటుతున్న వృద్ధురాలిని రైలు ఢీకొని అక్కడికక్కడే దుర్మరణం పాలైన ఘటన లాలాగూడ రైల్వే స్టేషన్ సమీపంలో చోటు చేసుకుంది. జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లాలాగూడకు చెందిన విశ్రాంతి నర్సు మేరీ(73) ఆదివారం ఉదయం చర్చికి వెళ్లేందుకు బయలుద్దేరింది. లాలాగూడ - మౌలాలి రైల్వే స్టేషన్ ప్రాంతంలో రైలు పట్టాలు దాటుతుండగా అదే సమయంలో రైలు ఢీకొట్టడంతో బలమైన గాయాలతో అక్కడికక్కడే మరణించింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కేజ్రీవాల్ అంటే మోదీకి భయం

- తెలంగాణ ఆప్ కన్వీనర్ దిడ్డి సుధాకర్
- కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా ధర్నాచౌక్ దగ్గర ఆప్ నాయకుల నిరాహార దీక్ష

కవాడిగూడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కేజ్రీవాల్‌ను చూసి మోదీ భయపడుతున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోతానేమోనన్న భయంతోనే కేజ్రీవాల్‌పై అక్రమ కేసు బనాయించి జైల్లో పెట్టించారని ఆరోపించారు. ఈడీ, సీబీఐ లాంటి దర్యాప్తు సంస్థలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన జేబు సంస్థలుగా మార్చుకొని, ప్రతిపక్ష నేతలను బెదిరిస్తోందన్నారు. దర్యాప్తు సంస్థల సాయంతోనే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గెలిచేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఢిల్లీ మద్యం కేసులో కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ ఆదివారం దేశ వ్యాప్తంగా జరిగిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా.. ధర్నాచౌక్‌లో ఆప్ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో కూడా నిరసన నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు సుధాకర్ అధ్యక్షత వహించగా.. కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, సీపీఐ రాష్ట్ర నాయకుడు బాల మల్లేశ్‌తో పాటు పలు పార్టీల నేతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఈ దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. లిక్కర్ స్కామ్‌లో ఎలాంటి ఆధారాలు లేకపోయినప్పటికీ కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారన్నారు. బీజేపీకి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో విరాళాలు ఇచ్చినవారిని బెయిల్‌పై విడుదల చేశారని ఆరోపించారు. కేజ్రీవాల్‌పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేసి బేషరతుగా విడుదల చేయాలని సుధాకర్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమిదే విజయమని ఆయన పేర్కొన్నారు. దీక్షలో సీపీఎం, సీపీఐ నాయకులు, పలువురు వక్తలు మాట్లాడారు. కేజ్రీవాల్ అరెస్టును వారంతా ఖండించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు.



నిరాహార దీక్షలో మాట్లాడుతున్న తెలంగాణ ఆప్ కన్వీనర్ సుధాకర్

జంతువులపై ప్రేమ చూపాలి

- తీర్థంకర్ సుందర్ మహారాజ్

రాంగోపాల్‌పేట్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : జంతువులను కూడా తమలాగే జీవులుగా పరిగణించి, వాటిపై ప్రేమను చూపాలని తీర్థంకర్ సుందర్ మహారాజ్ పిలుపునిచ్చారు. గ్రేటర్ హైదరాబాద్ సొసైటీ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ క్రుయాలిటీ టు ఆనిమల్ (జీహెచ్ఎస్‌పీసీఏ) ఆధ్వర్యంలో ఆదివారం పీజీ రోడ్డు డీవీ కాలనీలో గల జైన్ మందిర్‌లో మూగజీవుల పరిరక్షణపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యి ప్రసంగిస్తూ.... చాలా మంది గోశాలలకు వెళ్ళి ఆవులకు గడ్డి తినిపించి వాటిని ఉద్ధరించినట్లు ఫీల్ అవుతారని, వీధి కుక్కలకు బిస్కెట్లు వేసినంతనే పుణ్యం లభించదని, నిజానికి అన్నిరకాలుగా వాటి బాగోగులు చూస్తేనే తగిన ఫలం లభిస్తుందన్నారు. యువశక్తి, పెద్దల అనుభవం కలిస్తే ఏదైనా సాధించవచ్చన్నారు. జీహెచ్ఎస్‌పీసీఏ మూగజీవుల కోసం ప్రత్యేకంగా ఆసుపత్రిని, అంబులెన్స్‌ను అందుబాటులోకి తేవడమే కాక అవసరమయినవాటికి కృత్రిమఅవయవాలను కూడా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం సంస్థ సలహాదారు మహిప్‌జైన్ మాట్లాడుతూ.. తమ సంస్థ అధ్వర్యంలో త్వరలో హైదరాబాద్‌లో మూగ జీవాలకు వైద్య సహాయం అందించడం కోసం అత్యాధునిక యంత్ర పరికరాలతో ఆస్పత్రి నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో యానిమల్ వెల్ఫేర్ బోర్డు సభ్యులు గిరీష్ షా, వర్ధమాన సినీ నటుడు అశోక్ కుమార్, సంస్థ అధ్యక్షుడు దినేష్ అంచలియా, వ్యవస్థాపక కార్యదర్శి సురేందర్ బండారి, కోశాధికారి జోషి, సమన్వయకర్త సౌధర్మ్ బండారి, పశువైద్యుడు డాక్టర్ విశ్వ చైతన్యలతో పాటు జంతు ప్రేమికులు పలువురు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న తీర్థంకర్ సుందర్‌మహారాజ్



సర్టిఫికెట్లను పంపిణీ చేస్తున్న కావ్య కిషన్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర

నేర్చుకున్నదాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఏబీవీ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు కావ్య కిషన్ రెడ్డి

రాంగోపాల్‌పేట్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : నైపుణ్య కేంద్రంలో నేర్చుకున్నదాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి సతీమణి అటల్ బిహారీ వాజ్‌పేయ్ (ఏబివి) ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు కావ్యారెడ్డి అన్నారు. ఏబీవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని పాన్‌బజార్‌లో గల కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణా శిబిరం రెండో బ్యాచ్ ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. కార్యక్రమానికి హాజరైన కావ్యారెడ్డి శిక్షణ పొందిన 45 మంది మహిళలకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. అంతకు ముందు శిక్షణ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.... మహిళలు ఏదైనా సాధించగలరని, వారిలో నేర్చుకోవాలనే తపన ఉండాలన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర, మహిళామోర్చా నాయకురాలు కంది అనురాధ, మమత, కోమల్, రమ, స్కిల్ సెంటర్ ఇన్‌చార్జి నీరజ, ఇన్‌స్ట్రక్టర్స్ కవిత, లక్ష్మి, సుజాత, శిక్షణ పొందిన మహిళలు పాల్గొన్నారు.

మెడికల్ హాలులో అగ్నిప్రమాదం

బోయినపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఓ మెడికల్ హాల్లో ఆదివారం తెల్లవారు జామున అగ్నిప్రమాదం సంభవించిన సంఘటన బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బోయిన్‌పల్లిలో గల రాజరాజేశ్వరి మెడికల్ హాల్ కమ్ క్లినిక్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం బోయిన్‌పల్లి సీతారాంపురంకు చెందిన సునీత గత కొంతకాలంగా ఓల్డ్‌బోయిన్‌పల్లి పాత ఐస్ ఫ్యాక్టరీ వద్ద రాజరాజేశ్వరి క్లినిక్ కం మెడికల్ హాల్‌ను నిర్వహిస్తుంది. ఈ క్రమంలో రోజులాగే శనివారం రాత్రి మెడికల్ హాల్‌ను మూసివేసి ఇంటికి వెళ్ళిపోయింది. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున సుమారు మూడుగంటల నలభై నిమిషాల ప్రాంతంలో దారినవెళ్లే ఓ వ్యక్తి మెడికల్ హాల్ నుంచి దట్టమైన పొగలు రావడం గమనించాడు. దీంతో షాపుపై ఉన్న ఫోన్ నెంబర్‌కు ఫోన్‌చేసి విషయాన్ని తెలియజేశారు. దీంతో షాపుకు చేరుకున్న సునీత స్థానికుల సహాయంతో షాపు తెరిచి చూడగా షాప్‌లో నిప్పంటుకొని మంటలు వ్యాపించాయి. దీంతో స్థానికుల సాయంతో మంటలను ఆర్పి విషయాన్ని పోలీసులకు తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదుచేసుకుని అగ్నిప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. కాగా ఈ అగ్నిప్రమాదంలో మెడికల్ హాల్‌లో ఉన్నటువంటి రిఫ్రిజిరేటర్, ఫోన్, మందులు మెడికల్ కిట్లు కాలిపోయినట్లు ఫిర్యాదులో సునీత పేర్కొన్నట్లు పోలీసులు వెల్లడించారు.

రత్నదీప్ సూపర్ మార్కెట్‌లో అగ్నిప్రమాదం

- భారీగా ఎగిసిపడిన మంటలు
- నగర శివారులో ఘటన



మార్కెట్‌లో ఎగిసిపడుతున్న మంటలు, పొగ చెలరేగిన దృశ్యాలు

నార్సింగ్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో ఆదివారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో త్వరలో ప్రారంభం కానున్న ఓ సూపర్ మార్కెట్ కాలిబూడిదైంది. ఈ ఘటన బండ్లగూడ మున్సిపాలిటీ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. లంగర్‌హౌజ్-అప్పా రేడియల్ మార్గంలో ప్రధాన రోడ్డుకు అనుకుని రత్నదీప్ సెలెక్ట్ సూపర్ మార్కెట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఉగాది నుంచి ప్రారంభం కావాల్సిన మార్కెట్‌లో సెంట్రల్ ఏసీతో పాటు అన్ని రకాల ఎలక్ట్రికల్ పరికరాల ఏర్పాటు జరుగుతోంది. ఆదివారం సామగ్రి ఏర్పాటు చేస్తుండగా అగ్ని ప్రమాదం జరిగిందని, మంటలకు దట్టమైన పొగ అలుముకోవడంతో అందరం ఒక్కసారిగా బయటకు పరుగులు పెట్టామని కార్మికులు తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో కార్మికులు ఎవరూ గాయపడలేదని జిల్లా అగ్నిమాపక అధికారి గిరిధర్‌రెడ్డి తెలిపారు. ఆస్తి నష్టం లక్షల్లోనే ఉంటుందని, ఈ ప్రమాదానికి వెల్డింగ్ పనులు కారణమా లేక షార్ట్ సర్క్యూట్ కారణమా అన్నది దర్యాప్తులో తేలుతుందని అన్నారు. ఈ ఘటనపై రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇందిరమ్మ స్ఫూర్తితో కంటోన్మెంట్ అభివృద్ధి

- కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థి ఎన్.శ్రీగణేష్



శ్రీగణేష్‌ను సత్కరిస్తున్న బస్తీవాసులు

సికింద్రాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): దివంగత ప్రధాని ఇందిరాగాంధీ స్ఫూర్తితో సికింద్రాబాద్ కంటోన్మెంట్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని, తనను ఉప ఎన్నికల్లో గెలిపించాలని సికింద్రాబాద్ కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థి ఎన్.శ్రీగణేష్ అన్నారు. ఆదివారం మూడో వార్డులోని ఉత్తరయ్య గుడిసెలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా బస్తీవాసులు పలు సమస్యలు మొరపెట్టుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం గణేష్‌ను బస్తీవాసులు సత్కరించారు. అలాగే ఈస్ట్ మారేడుపల్లి వడ్డెర బస్తీలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు ధనలక్ష్మి అధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి శ్రీగణేష్ విచ్చేసి ప్రభుత్వం ప్రజల కోసం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. రాష్ట్రంలో మహిళల అండతోనే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిందన్నారు.

మళ్లీ పెరిగిన చికెన్ రేట్లు

- లైవ్‌బర్డ్ రూ.220
- స్కిన్‌లెస్ కిలో రూ.320
- నాటుకోడి కిలో రూ.400పైనే..
- కృత్రిమ కొరత సృష్టించి దోచుకుంటున్న వైనం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో చికెన్ రేట్లు మళ్లీ దడ పుట్టిస్తున్నాయి. 15 రోజుల క్రితం వరకు కాస్త అందుబాటులోకి వచ్చిన ధరలు.. ఆదివారం ఒక్కసారిగా పెరిగాయి. కిలోపై రూ.80 నుంచి రూ.100 వరకు పెరగడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు చికెన్‌ను కొనుగోలు చేసేందుకు వెనకంజ వేశారు. గ్రేటర్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా చికెన్ రేట్లు గరిష్ఠంగా పెరిగాయి.

తగ్గినట్లే తగ్గి..!

మార్చి మూడో వారంలో నగరానికి కోళ్ల దిగుమతి పెరగడంతో రేట్లు కాస్తా అందుబాటులోకి వచ్చాయి. ఈ మేరకు మార్చి 17 నుంచి ఏప్రిల్ 2 వరకు లైవ్‌కోడి కిలో రూ.120 నుంచి రూ.140 వరకు, స్కిన్‌లెస్ కిలో రూ.180 నుంచి రూ.200-220 వరకు విక్రయించారు. అయితే రేట్లు అందుబాటులోకి వచ్చాయని భావిస్తున్న తరుణంలో రెండు రోజులుగా మళ్లీ పెంచారు. ఆదివారం స్కిన్‌లెస్ కిలో రూ.300 నుంచి 320 వరకు, లైవ్‌బర్డ్ రూ.200 నుంచి రూ.210 వరకు విక్రయించారు. నాటుకోడి కిలో బర్డ్‌ను రూ.400పైగానే అమ్మారు.

ఎండలను అడ్డుపెట్టుకుని దోపిడీ..

నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ఎండలను అడ్డుపెట్టుకుని వ్యాపారులు అడ్డగోలుగా దోచుకుంటున్నారని కొనుగోలుదారులు వాపోతున్నారు. నగర శివారు ప్రాంతాల నుంచి కోళ్ల దిగుమతి ఎక్కువగా ఉన్నప్పటికీ కొంత మంది కృత్రిమ కొరత సృష్టించి అందిన కాడికి దోచుకుంటున్నారని చెబుతున్నారు. స్కిన్‌లెస్ కిలో రూ.300 నుంచి 320 వరకు రేటు పెట్టడం దారుణమని, దీనికంటే రూ.400 పెడితే మటన్ వస్తోందని పేర్కొంటున్నారు. ధరలను నియంత్రణపై ఎవరూ పట్టించుకోకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.